క్లుప్తంగా

నేడు విశ్రాంత ఉద్యోగుల దీక్ష

నారాయణపేట రూరల్: రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద విశ్రాంత ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు దీక్షకు సంబంధించిన వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేస్వామి మందిరంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతన పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బాపన్‌గేరి వెంకటయ్య, గౌరవాధ్యక్షుడిగా సరాఫ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, యువసేన అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, వినోద్, ఉపాధ్యక్షులుగా వెంకట్రాములు, శ్రీనివాస్, వెంకట్రాములు, నర్సిములు, నారాయణ, సహాయ కార్యదర్శులుగా గురులింగప్ప, పాండు, సంతోష్, వెంకటేష్, మహేష్, లక్ష్మణ్, కోశాధికారిగా ప్రశాంత్, పాలక మండలి సభ్యులు యల్లప్ప, వెంకట్రాములు, బాలరాజ్, నారాయణ, సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సరాఫ్ కృష్ణ మాట్లాడుతూ తమ ఆరాధ్య దైవం వేద వ్యాస మహర్షి అన్నారు. హక్కులను సాధించుకోవడం కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. నాయకులు ఓంప్రకాశ్, బాల్‌రాజ్, హన్మంతు, బాలప్ప, కృష్ణ, భీమయ్య, గోపాల కృష్ణ, సంతోష్‌కుమార్, వినోద్, కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఊట్కూరు: లయన్స్‌క్లబ్ నూతన కమిటీని జోన్ చైర్మన్ రమేష్‌రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఊట్కూరులో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డా.ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, కార్యదర్శిగా హనుమంతు, ఉపాధ్యక్షులుగా వంశీరెడ్డి, విజయసింహారెడ్డి, కోఆర్డినేటర్‌గా సూర్యప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా శంకర్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సీనియర్ సభ్యులు జి నరేందర్, చంద్రకాంత్‌గౌడ్, కె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం




మక్తల్: పట్టణంలో అభ్యాస ది స్కూల్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎం రాఘవేందర్‌చారీ, డైరెక్టర్ కర్నిస్వామి, వెంకటేష్, అంజయ్యాచారి, నర్సిములు, కొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ను వినియోగించుకోండి

నారాయణపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ అనిత అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆదివారం 2వ వార్డు పరిధిలోని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందించారు. సోమవారం నుంచి ఈ నెల 13 వరకు వార్డులో కంటివెలుగు శిబిరం నిర్వహిస్తారని అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా కంటి సంబంధ సమస్యలు ఉన్నవారు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో పరీక్షలు చేయించుకొని అవసరం మేరకు కంటి అద్దాలు, మందులు తీసుకుని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ శివమ్మ, లక్ష్మి, బీఆర్‌ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు దేవరాజ్, మాజీ కౌన్సిలర్ వినోద్, పట్టణ బీఆర్‌ఎస్ కోశాధికారి సుతారి రాంరెడ్డి, నాయకులు జోన్నల సుభాష్, శివకుమార్, తిరుపతి, కర్లి ఆనంద్‌కుమార్, ఎండీ ఆసిఫ్, రమేష్‌కుమార్, వినోద్‌కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

జేఐహెచ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఊట్కూరు: జేఐహెచ్ ఆధ్వర్యంలో ఊట్కూరులోని పంచమసీద్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. జడ్చర్ల మండల అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ రంజాన్ నెలలో ఖురాన్ గ్రంథం అవతరించిందన్నారు. ఈ నెల ముస్లింలకు పవిత్రమైందని అన్నారు. నెల రోజులపాటు పాటించే ఉపవాసాల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఏఎస్‌ఐ అఫ్జల్, నాయకులు డా లియాకత్‌అలీ, మహమ్మద్‌రఫీ, గడ్డ మంచూర్, కల్వాల్‌ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న మొక్కలు





ఎర్రగుట్ట రోడ్డులో ఎండిపోయిన హరిత హారం మొక్కలు

సంరక్షణ చర్యలు చేపడతాం

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన ప్రతి మొక్కకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. కాలనీల్లో నాటి మొక్కలకు కూడా నీరందించే విధంగా చర్యలు తీసుకుంటాం. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటిస్తాం. ప్రతి మొక్కకు ట్రీగార్డు ఏర్పాటు చేస్తాం. అన్ని వార్డుల్లో నీరు అందించడానికి ట్యాంకర్లు ఏర్పాటు చేస్తాం.

– భరత్,
మున్సిపల్ అధికారి, నారాయణపేట

నారాయణపేట టౌన్ : రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం చేపట్టి మొక్కలు నాటించింది. కానీ క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సరైన పర్యవేక్షణ చేపట్టక పోవడంతో లక్ష్యం నీరుగారిపోతోంది. మొక్కలు నీరు అందక ఎండిపోతున్నాయి. మున్సిపల్ పరిధిలో పలు కాలనీల్లో రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. కానీ వాటి సంరక్షణను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా బీసీ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో కొన్నిచోట్ల నాటిన మొక్కలు ఒక్కటి కూడా సరిగా లేవు. పూర్తిగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. సివిల్‌లైన్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గీర్‌రోడ్, ఎర్రగుట్ట రోడ్‌లో కూడా మొక్కలు నీరు అందకపోవడంతో ఎండిపోతున్నాయి. సింగార్‌బేస్, సాయి విజయ్ కాలనీ, గాంధీనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పాక్షికంగా ఎండిపోయాయి. ఇదిలా ఉంటే మరికొన్ని చోట్ల మొక్కలు నాటకుండా గుంతలు తవ్వి వదిలేశారు. ఇంకొన్ని చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయకపోవడంతో మొక్కలను పశువులు తినేస్తున్నాయి. దీంతో పాటు మిషన్ భగీరథ పనుల నేపథ్యంలో తవ్వకాలు చేపట్టడమూ మొక్కల పెరుగుదలకు శాపంగా మారిందని ప్రజలు అంటున్నారు. తవ్వకాలలో మొక్కలు పెరుగకుండా పోయాయి. ఆయా వార్డుల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు లేక వాడిపోతున్నాయని పలు కాలనీ ప్రజలు వాపోతున్నారు. నాటిన మొక్కకు చుట్టు పక్కన పిచ్చి మొక్కలు సైతం పెరగడంతో ఎదుగదల కావడం లేదంటున్నారు. వీటితో పాటు ప్లాస్టిక్ కవర్లు పేర్కొని పోవడంతో నీరు అందడం లేదని ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బసవేశ్వర విగ్రహ స్థాపనకు కదులుదాం



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలో బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని వీరశైవ లింగాయత్ – లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గందె రవికాంత్ అన్నారు. స్థానిక శివలింగేశ్వర దేవాలయంలో ఆదివారం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు ఏడాది బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేద్దామని, అందుకు రూ.10లక్షలను జమ చేశామని, మరో రూ.20లక్షలకు దాతల సహకారం కోరుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని లింగాయత్‌ల కుల గణన చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయను ఆమె ఇంట్లో కలుసుకున్నారు. అదేవిధంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని కమిటీ సభ్యులు కలుసుకుని వినతి పత్రం అందించారు. పట్టణంలో బసవ భవన్ ఏర్పాటుకు స్థలం చూయించాలని విజ్ఞప్తి చేశారు. గందె చంద్రకాంత్, శివకుమార్, మల్లికార్జున్, శంకర్‌బాబు, అర్కంచి రవికుమార్, కన్న జగదీష్, శివకుమార్, నాగభూషణం, శ్రీశైలం, డాక్టర్ సచిన్, లిఖారఘుబాబు, నగర్‌విశ్వనాథ్, రాచప్ప, సురేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిద్దాం



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

నారాయణపేట రూరల్ : జిల్లాలోని పేద రెడ్డి కుల విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతను అందించేందుకు కృషి చేద్దామని పాలమూర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. పట్టణంలోని కృష్ణగోకులం స్కూల్‌లో ఆదివారం జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాస్టల్, భోజనం తదితర వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో రెడ్డి సేవా సమితి భవనం నిర్మిస్తామన్నారు. రెడ్డి అనేది కులం కాదని ఒక వ్యవస్థ అని అన్నారు. త్యాగాలతో పేదలకు తోడ్పాటు అందాలన్నారు. ఆర్థిక పరిపుష్టి కల్పించడమే ధ్యేయంగా పని చేద్దామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, పట్లోల లక్ష్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంతోష్, సత్యనారాయణ, లింగారెడ్డి, కృపాకర్, గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్రామారెడ్డి, మాధవరెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా తాగునీటికి కటకట

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీరు కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. మిషన్‌భగీరథ నీరు ఆగిపోవడం, కనీసం బోరు వాటర్ కూడా లేకపోవడంతో నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్నా బాధ్యులు చోద్యం చూస్తున్నారని, సమస్య పరిష్కరించడం లేదని ఆరోపిస్తున్నారు. కాగా ప్రస్తుతానికి సర్పంచ్ ట్యాంకర్‌తో నీరు తెప్పించారని, వెంటనే సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించి తాగునీటి ఎద్దడి తీర్చాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



నారాయణమ్మను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : ఇటీవల నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడారు. ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని సంప్రదించి పట్టణంలో ముదిరాజ్ సంఘం భవనం నిర్మాణం మంజూరు చేయించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు సరాఫ్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, కంటి ఎల్లప్ప, అప్పిరెడ్డిపల్లి రాము, హన్మంతు, వెంకట్రాములు, సంజీవ్‌ప్రకాశ్, బాలరాజ్, సంతోష్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

ఊట్కూరు: మండలంలో ఆదివారం రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఊట్కూరు, చిన్నపొర్ల, పెద్దపొర్ల, పగిడిమారి, పులిమామిడి తదితర గ్రామాల్లో పద్మశాలి కులస్తులను కలిసి నాయకులు సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా చిన్నపొర్ల చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బోగం లక్ష్మీనారాయణ మాట్లాడారు. పద్మశాలి అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులందరికీ ఆసరా ఫించన్ మంజూరు చేయాలన్నారు. నాయకులు ఏర్పుల మనోహర్, విఠోబా, తిరుపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో కౌన్సిలర్ మృతి



లక్ష్మి (ఫైల్)

కోస్గి: మున్సిపల్ విలీన గ్రామం మల్‌రెడ్డిపల్లికి చెందిన కౌన్సిలర్ లక్ష్మి(36) గుండెపోటు రావడంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు మూడో వార్డు మల్‌రెడ్డిపల్లికి చెందిన లక్ష్మి బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా ఉన్నారు. ఏడాది కాలం నుంచి గుండె సంబంధ సమస్యతో బాధపడున్నారు. చికిత్స తీసుకుని మందులు వాడుతున్నారు. కాగా రెండు రోజుల క్రితం నొప్పి రావడంతో స్థానికంగా మందులు వాడారు. వరుసగా సెలవు దినాలు రావడంతో సోమవారం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్దామని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ లోపే ఆదివారం మరోమారు గుండెలో నొప్పి రావడంతో ఒక్కసారిగా లక్ష్మి కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త అంజిలయ్యతోపాటు ఓ కుమారుడు ఉన్నారు.

బలగం సినిమా ప్రదర్శన



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఆదివారం రాత్రి ప్రొజెక్టర్ ద్వారా బలగం సినిమా ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో యువత ముందుకు వచ్చి సినిమా ప్రదర్శించారు. తెలంగాణ భాష, యాస, కుటుంబ నైపథ్యంలో సాగిన ఈ సినిమా కంటతడి పెట్టిస్తోందని అన్నారు. గ్రామస్తులు సినిమా చూసి తమ పెద్దలను తలుచుకుని కన్నీరు మున్నీరయ్యారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం



నారాయణపేట రూరల్ : మాస్టర్ కేశవ్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కరాటే విద్యార్థులకు స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో ఆదివారం బెల్టులు, సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడు కేశవ్ మాట్లాడుతూ.. పలువురు విద్యార్థులు శిక్షణ పొందినా 50మంది చక్కటి ప్రతిభ కనబరిచారని, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, మెరూన్, బ్రౌన్ బెల్టులు సాధించారని చెప్పారు. నిరంతరం కరాటే సాధన చేయాలని, అమ్మాయిలు నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బాలరాజు, శివకుమార్, రసూల్, మహేష్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మైనార్టీ గురుకుల స్కూల్ చిన్నారులు బెల్టులు సాధించిన వారిలో ఉండటంతో వారిని పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజా మహమూద్ ఖాన్, టీచర్లు శివకుమార్, అజిత్, ఖాసీం అభినందించారు.


విద్యార్థులకు నోట్‌బుక్‌ల అందజేత



మక్తల్: మున్సిపాలిటి పరిధిలోని చందాపూర్‌లో అల్లుఅర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమాన సంఘం నాయకులు ఆదివారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు, ప్యాడ్లులను అందజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అధ్యక్షుడు నవీన్, కార్యదర్శులు వెంకీ, జేసీబీ వెంకీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

మద్దూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే సమావేశానికి ఆదివారం నాయకులు తరలివెళ్లారు. సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతకలహాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వెళ్లిన వారిలో అంజిలయ్య, జోషి, మహ్మద్‌అలీ, శివకుమార్, అశోక్, లాలప్ప, ప్రకాష్, భరత్, భాస్కర్‌రెడ్డి, హన్మంతు, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ధ్యేయం



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. కోటకొండ, అమ్మిరెడ్డిపల్లి, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాల్లోని 110 మంది కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరడంతో వారిని పార్టీ కండువాతో సత్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తోందన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణమని, ప్రతిపక్షాలు మనుగడ కోసమే ప్రభుత్వం పై చౌకబారు విమర్శలు చేస్తున్నారని, వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. యాభై ఏళ్లతో పోల్చితే కేవలం ఎనిమిదేళ్లలో చేసి చూపిన ప్రజాసంక్షేమమే అభివృద్ధికి కొలమానమన్నారు. నియోజకవర్గాన్ని సమూలాభివృద్ధి చేయడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమితి మండల అధ్యక్షుడు వెంకట్రాములు గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వేపూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి



విద్యార్థులతో అనిల్‌గౌడ్

మక్తల్: చదువును మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలని స్థానిక కేంద్రం కోఆర్డినేటర్ జీహెచ్‌ఎం అనిల్ గౌడ్ అన్నారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈనెల 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు సూచనలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఊట్కూరు: బాలుర ఉన్నత పాఠశాల ఊట్కూర్‌లో 1999లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అదేవిధంగా తాము చదువుకున్నా పాఠశాలకు, గ్రామానికి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని తీర్మానం చేశారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి, నర్సింహ, పవన్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమావేశం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో త్వరలో జరిగే ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలోని రైతు వేదికలో గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై, కల్పించవలసిన సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. వారం రోజుల పాటు జరిగే జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా తరలివస్తారని అన్నారు. ఈ మేరకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఎంబీ ఎబినేజర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



గీతాలాపన చేస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం, కొల్లంపల్లి, బైరంకొండ గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏసు ప్రభువును ప్రార్థిస్తూ పాటలు పాడారు. వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. కల్వరి కొండకు చేరుకుని ఆరాధన చేశారు. అనంతరం ఇమ్యునల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, పాస్టర్ నగేష్ సందేశాన్ని విన్నారు. కార్యక్రమంలో సంఘకాపరులు, సమాజ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంబీ ఎబినేజర్ చర్చిలో పాస్టర్ ఆర్.జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అంతకుముందు సామూహికంగా భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు రత్నయ్య, వినోద్, ఆనంద్, దేవీపుత్ర, పరంజ్యోతి, సువిశేషమ్మ, మత పెద్దలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

నారాయణపేట టౌన్ : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్ మిత్ర నేతృత్వంలో ఇంటింటికి తెలుగు దేశం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సింగారం, బైరంకొండ, జిలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో కరపత్రాలను అందజేశారు. ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు భాస్కరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, రామాచారి, సత్యనారాయణగౌడ్ ఆవుటి వీరన్న పాల్గొన్నారు.